క్లుప్తంగా

6వ తేదీలోపు సర్టిఫికెట్లు అందజేయాలి

దర్శి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో పరీక్షలు రాసి అర్హత పొందిన విద్యార్థులు ఈ నెల 6వ తేదీ లోపు ఒరిజినల్ సర్టిఫికెట్‌లు అందజేయాలని ప్రిన్సిపాల్ ఎస్.మాధవరావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలా ఇవ్వని వారి పేర్లు రద్దు చేసి వారి స్థానంలో వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి ప్రవేశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

తాళ్లూరు (ముండ్లమూరు): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కొండా యుగకీర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటలకు మండల పరిషత్ సమావేశపు హాలులో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరవుతున్నందున మండల స్థాయి అధికారులు గ్రామాల వారీగా ప్రగతి నివేదికలతో పాటు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

8 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

పెద్దదోర్నాల: వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 8 నుంచి మండల పరిధిలోని కడపరాజుపల్లెలో మెగా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు గోనుగుంట్ల పోలేరాజు, వట్టి నాగార్జునరెడ్డి తెలిపారు. మండల సచివాలయ కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నమెంట్‌లో ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ఉంటుందన్నారు. మ్యాచ్‌లో విజయం సాధించిన జట్టుకు మొదటి బహుమతిగా 30 వేల రూపాయలు, రెండో బహుమతిగా 20 వేల రూపాయలు, మూడో బహుమతిగా 10 వేల రూపాయలు అందించనున్నట్లు చెప్పారు. మ్యాచ్‌ల నిర్వహణకు గుంటూరు ఆంజనేయరెడ్డి సోదరులు గ్రౌండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 62810 85099, 72868 64400 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి సదరమ్ స్లాట్ బుకింగ్

కురిచేడు: వికలాంగులకు వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం నిర్వహించే సదరమ్ స్లాట్ బుకింగ్ శిబిరాలు గురువారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసిందని వైద్యాధికారి పి.ప్రవీణ్ తెలిపారు. వైకల్యం కలిగిన వారు, పిల్లలకు వైకల్యం కలిగిన వారు వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో ముందస్తు స్లాట్లను బుక్ చేసుకోవాల్సి ఉంది. ఆ స్లాట్ ప్రకారం నిర్ణయించిన జిల్లా వైద్యశాలలో సంబంధిత వైద్యుని వద్ద పరీక్షలు నిర్వహించి వైకల ధ్రువీకరణ పత్రం మంజూరు చేస్తారు. ఆ పత్రం ఆధారంగా చదువులో, ఉద్యోగంలో రిజర్వేషన్లు, బస్సు పాస్‌లు మంజూరు, పింఛన్ల మంజూరుకు కూడా సదరమ్ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయని, కావాల్సిన వారు స్లాట్లు బుక్ చేసుకోవాలని డాక్టర్ ప్రవీణ్ తెలిపారు.

డీఈఈగా షియా నాయక్


బాధ్యతలు స్వీకరించిన షియా నాయక్

కంభం: విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఇంజినీర్‌గా ఎస్.షియా నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న బాలఅంకయ్య ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో మార్కాపురం సబ్ డివిజన్ డిప్యూటీ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న షియా నాయక్‌కు కంభానికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

డెంగీతో అప్రమత్తంగా ఉండాలి

పెద్దదోర్నాల: మండల ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీఓ నాసరరెడ్డి పేర్కొన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండల పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున గ్రామాల్లో డెంగీ, డయేరియా, మలేరియాతో పాటు విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. చింతల వైద్యాధికారి డాక్టర్ యగిన్క్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి టైగర్ దోమతో వ్యాపిస్తుందన్నారు. జ్వరం, తలనొప్పి, చలి, కళ్లు ఎర్రబడటం తదితర లక్షణాలతో పాటు రక్త కణాలు తగ్గి పోతాయన్నారు. వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు సంబంధించి జ్వర పీడితుల నుంచి రక్తపూత నమూనాలు సేకరించి నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో తిరిగి విద్యార్థులకు, ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నీటి తొట్లు, టైర్లు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ మస్తాన్‌నాయక్, సీహెచ్‌ఓ మంత్రునాయక్, సూపర్‌వైజర్ ఇజ్రాయేల్, సబ్ యూనిట్ అధికారి రమేష్ బాబు, సత్యనారాయణరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు

భారత న్యాయ వ్యవస్థలో కొత్త అధ్యాయం


విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న విజయలక్ష్మి

పొదిలి: భారతీయ న్యాయ వ్యవస్థలో 3 నూతన చట్టాల అమలుతో కొత్త అధ్యాయం ప్రారంభమైందని బిట్స్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ బెల్లంకొండ విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో విద్యార్థులకు కొత్త చట్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐపీసీ స్థానంలో బీఎన్‌ఎస్, సీఆర్‌పీసీ స్థానంలో బీఎన్‌ఎస్‌ఎస్, ఐఈఏ స్థానంలో బీఎస్‌ఏ చట్టాలను పార్లమెంటు ఆమోదించిందని వివరించారు. కొత్త చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత తొలి కేసు దేశ రాజధాని ఢిల్లీలో, తెలంగాణాలో చార్మినార్ ప్రాంతంలో మరో కేసు, ఏపీలోని మార్కాపురం మండలం వేములకోటలో హత్య కేసు నమోదయ్యాయని చెప్పారు. భారత న్యాయ సంహిత(బీఎన్‌ఎస్) ప్రకారం క్రిమినల్ కేసుల్లో విచారణ పూర్తయిన 45 రోజుల్లోగా తీర్పు వెలువడాలన్నారు. తొలి విచారణ జరిగిన 60 రోజుల్లోగా చార్జ్‌షీట్ నమోదు చేయాల్సి ఉంటుందని, రాజద్రోహం అనే పదం తొలగించారన్నారు. చిన్నారులపై సామూహిక అత్యాచారాలకు మరణ శిక్ష లేదా యావజ్జీవ శిక్ష విధిస్తారన్నారు. పెళ్లి చేసుకుంటామని మోసం చేయడం, ముఖాలపై యాసిడ్ పోయడం, శారీరక సంబంధాలు పెట్టుకుని మోసం చేయడం లాంటి కేసులకు కొత్త చట్టాల్లో కఠిన నిబంధనలు విధించారన్నారు. ఐపీసీలో 511 సెక్షన్‌లు ఉంటే, వాటిని న్యాయ సంహిత ద్వారా 358కి కుదింపు చేశారని చెప్పారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బెల్లంకొండ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ నారపుశెట్టి నాయుడు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ తోట శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన పారిశుధ్య కార్మికుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కొమరోలు: మండల కేంద్రం కొమరోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులు, పారిశుధ్య కార్మికుల జీతభత్యాలు 30 నెలలుగా గ్రామ సర్పంచ్ నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న పారిశుధ్య కార్మికులు రెండు రోజులుగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. రెండో రోజు బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 15 మంది పారిశుధ్య కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేశారు. పారిశుధ్య కార్మికులకు మద్దతుగా సీపీఎం నాయకురాలు పోసాని అంజమ్మ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంజమ్మ మాట్లాడుతూ 30 నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వక పోవడంతో కార్మికులు తమ కుటుంబాలు పోషించడానికి అప్పులు చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

రైతులకు అండగా నిలబడాలి


రైతులను సత్కరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

గిద్దలూరు రూరల్: రైతులకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని స్థానిక వ్యవసాయ శాఖ ఏడీ బాలాజీనాయక్ అన్నారు. ప్రపంచ వ్యవసాయ దినోత్సవాన్ని పురస్కరించుకోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ఉత్తమ రైతులకు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రైతే ఆదర్శంగా ఉండాలంటే అధిక పంటలను దిగుబడి సాధించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక పంటలను సాగు చేయాలన్నారు. ప్రతి రైతు ముఖంలో ఆనందం చూడాలన్నదే వ్యవసాయశాఖ అధికారుల ముఖ్య ఉద్దేశమన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణ రెడ్డి, ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, బీజేపీ నాయకులు మట్టిమల్ల పుల్లయ్య, రామాజంనేయులు, వెంకట్, నరేష్, రైతులు పాల్గొన్నారు.

రుచిగా,శుచిగా భోజనం అందించాలి

పుల్లలచెరువు: విద్యార్థులకు రుచికరంగా ఉండే విధంగా పరిశుభ్ర వాతావరణంలో తయారు చేసి భోజనం అందించాలని ఎంఈవో శామ్యూల్ జాన్ సూచించారు. ఎంఈవో శామ్యూల్‌జాన్ బుధవారం మండలంలోని చాపలమడుగు పాఠశాలను తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను తనిఖీ చేసి నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం, పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులను పరిశీలించి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పరిశుభ్ర వాతావరణంలో తయారు చేసే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత త్వరగా నాడు- నేడు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా చక్కటి బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నిల్వ స్టాక్‌ను అప్‌లోడ్ చేసుకోవాలి

దర్శి: మండలంలో ఉన్న విత్తనాలు షాపుల్లో నిల్వలను వెంటనే అప్‌లోడ్ చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ ఆదేశించారు. మండలంలోని ఎరువులు, విత్తనాలు దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ బుక్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా బాలాజీనాయక్ మాట్లాడుతూ తమ తమ షాపుల్లో ఉన్న నిల్వలను స్టాక్ బోర్డుల్లో ఉంచాలని సూచించారు. రైతులకు విత్తనాలు అమ్మినప్పుడు వారికి తప్పనిసరిగా బిల్ ఇవ్వాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ వస్తున్నందున రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పని సరిగా బిల్లులు అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎవరైనా బిల్లులు ఇవ్వకుంటే తమ దృష్టికి తీసుకొస్తే అటువంటి షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు రైతులకు అమ్మితే ఆ షాపులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ బాలకృష్ణనాయక్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మెకానిక్ డే


ర్యాలీకి హాజరైన మెకానిక్‌లు

దర్శి: ప్రపంచ మెకానిక్ డే సందర్భంగా దర్శిలో మెకానిక్ డేను ఫ్రెండ్స్ మోటారు సైకిల్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మెకానిక్ యూనియన్ కార్యాలయం నుంచి టూ వీలర్ మెకానిక్‌లు ర్యాలీ నిర్వహించి జెండా వందనం చేశారు. ప్రెసిడెంట్ దర్బార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు అరెగెల దశరథ, ఎస్‌కే రసూల్, ఆర్.సుభానీ, వీరయ్య, షేక్ ఖాశీం, వలి, వైస్ ప్రెసిడెంట్ అమరేశ్వరరావు, సెక్రటరీ జి.రమేష్, ట్రెజరీ కె.ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీ ఎస్.బుజ్జి, మెంబర్లు పి.చిరంజీవి, షేక్ మహబూబ్ బాషా, కె.వెంకట నాగేశ్వరరావు, జి.నరశింహారెడ్డి, షేక్ బాజీ, పి.పిరుబాషా, షేక్ గులాం, మెకానిక్ సోదరులు పాల్గొన్నారు.

సీడ్ విలేజ్‌లకు అందుబాటులో వరి విత్తనాలు


కార్యాలయంలో ఉన్న వరి విత్తనాల బస్తాలు

పొదిలి: మండలంలోని సీడ్ విలేజ్‌లకు వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ తెలిపారు. బీపీటీ-5204 రకం విత్తనాలు 120 బస్తాలు కార్యాలయంలో నిల్వ చేశామని చెప్పారు. ఎంపిక చేసిన సీడ్ విలేజ్‌ల్లో 30 మంది రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తామని, మూడు పర్యాయాలు పంట కాలంలో శిక్షణ, అవగాహన కల్పిస్తామని తెలిపారు. అన్నవరం, ఆముదాలపల్లి, కుంచేపల్లి తదితర గ్రామాల రైతులు వరి వేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఎల్‌ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలు 100 క్వింటాళ్లు అవసరమని ఉన్నతాధికారులకు నివేదించామని, రెండు రోజుల్లో కంది విత్తనాలు వచ్చే అవకాశం ఉందని ఏఓ పేర్కొన్నారు.

దివ్యాంగుల కేంద్రానికి ప్లేట్లు, గ్లాసులు అందజేత


దివ్యాంగ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న ఐసీఈయూ సభ్యులు

మార్కాపురం టౌన్: మార్కాపురం ఎల్‌ఐసీ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసీఈయూ) 74వ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ మానసిక రుగ్మతల దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం 25 భోజనం ప్లేట్లు, 25 గ్లాసులు అందజేశారు. యూనియన్ చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా వీటిని అందించారు. ట్రాఫిక్ హోమ్‌గార్డు చెన్నుపల్లి కాశయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఏజెంట్లు, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీధుల వెంట ఉన్న వృద్ధులకు, అనాథలకు భోజన ప్యాకెట్లు, దుప్పట్లు అందించారు.

అతిసారం ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి


చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పొదిలి: చిన్నారులు అతిసారం బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ శరత్ చంద్ర సూచించారు. బుధవారం శివాలయం వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు, గర్భిణులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. చేతుల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ప్రధానంగా భోజనానికి ముందు చేతులు తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ మెరీనా, ఎంఎల్‌హెచ్‌పీ జీ.సుప్రజ, ఏఎన్‌ఎం కె.విజయ, ఎన్.రాణి, అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.నాగమణి, ఆశ కార్యకర్తలు పి.సుజాత, నాగమణి, ఎన్.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులకు సన్మానం


వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

కొనకనమిట్ల: అంతర్జాతీయ డాక్టర్స్ డేను పురస్కరించుకుని బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యులు ఎస్సీ బాలయ్య, సురేఖను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు కొండ్రు వెంకటేశ్వర్లు, అంబేడ్కర్ యూత్ ఫోర్స్ నాయకులు బాలనరసయ్య, రామకోటేశ్వరరావు మాట్లాడుతూ.. వైద్యులు దైవంతో సమానమని, రోగులకు వైద్య సేవలు అందించి వారికి పునర్జన్మను ప్రసాదించే వారిని సన్మానించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యులకు అంబేడ్కర్ చిత్ర పటాన్ని అందించి సన్మానించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు పిల్లి కొండయ్య, గొంగటి కరుణయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు.

గురుపౌర్ణమి సందర్భంగా సాయిభక్తుల భిక్ష


సాయిభిక్షలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయి భక్తులు పట్టణంలో సాయి భిక్షాటన నిర్వహించారు. గత నెల 30 నుంచి ఈనెల 3వ తేదీ వరకు సుమారు 200 మంది సాయిభక్తులు భిక్షలో పాల్గొన్నారు. నాలుగు రోజులపాటు పట్టణంలోని గృహాలను సందర్శించి భిక్ష స్వీకరించారు. ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు మందిరంలో రోజూ ఆధ్యాత్మికవేత్తలతో సాయి సప్తాహ ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మందిర వ్యవస్థాపక కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షుడు రామడుగు గోపి, యువ సేవా సమాజ్ అధ్యక్షుడు గోపాలుని కృష్ణమోహన్, కమిటీ ప్రతినిధులు పవన్, హరి, విజయ్, వెంకటేశ్వర్లు, మధుతోపాటు మహిళా సేవా సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకే ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రయ్య

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

తర్లుపాడు: తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని, అందుకు సంబంధించిన జీవోను వెంటనే విడుదలచేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. 117 జీవో రద్దు చేసి పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పోతలపాడులో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డీఎస్సీ నిర్వహించే వరకు విద్యా వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్ ఎస్‌కె మౌలాలీ, మండల ఎస్టీయూ అధ్యక్షులు కేవీ జగన్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే నజీర్, నాయకులు సీహెచ్ కాశయ్య, కేవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కంభం: అనుమతులు లేని కంపెనీల విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ హెచ్చరించారు. ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.రామ్మోహన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ దుకాణంలో సరైన అనుమతి పత్రం లేకుండా నిల్వలు ఉండటం గుర్తించి ఎస్‌ఆర్‌ఐ, అన్నపూర్ణ కంపెనీకి చెందిన 1390 కేజీల విత్తనాల అమ్మకాలు నిలిపివేసారు. వాటి విలువ రూ.62 వేలు ఉన్నట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, సరైన ధృవీకరణ పత్రాలు లేని విత్తనాలు విక్రయించినా చర్యలు తప్పవన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. మండల వ్యవసాయాధికారి డి.స్వరూప పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతుల సాగుతో నాణ్యమైన దిగుబడులు


మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో సాగు చేయడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త మానస తెలిపారు. మండలంలోని దారంవారిపాలెంలో పెరటి తోటల పెంపకానికి సంబంధించి 50 మంది ఎస్సీ కుటుంబాల వారికి పెరటి తోట విత్తనాలను బుధవారం దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు పెరటి తోటల పెంపకంలో మెళకువలపై అవగాహన కల్పించారు. అనంతరం రైతుల పొలాల్లో మట్టి నమునాల సేకరించారు. రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో సాగుపై దృష్టి పెట్టాలన్నారు. డీబీఆర్‌సీ నాయకులు దార్ల కోటేశ్వరరావు, గోపనబోయిన వెంకట్రావు, రైతులు కుంచాల దాసు, రోశయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన


పూజలందుకుంటున్న అమ్మవారు

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కోటి కుంకుమార్చన పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని గాయత్రి మంత్రోచ్చారణ, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఉభయదాతలను ఆలయంలోకి మేళ తాళాలతో ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, ప్రధాన సలహాదారులు మురళీ కృష్ణమాచార్యులు, నిర్వాహకులు యక్కలి శేషగిరిరావు, ఎస్.నాగేశ్వరరావు, పెరుమాళ్ల భాస్కర్, పొనుగుపాటి కోటేశ్వరరావు, సాయి తదితరులు పాల్గొన్నారు.